PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :104 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : మంగళవారం - 29 సెప్టెంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:104 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: TUESDAY 29 SEPTEMBER 2026 PAGES: 04 RS:01/



అక్టోబర్ 1న ఉదయం 6.30 నుంచే

పింఛన్ల పంపిణీ

- రాష్ట్రవ్యాప్తంగా 61.80 లక్షల మందికి రూ.2,692.34 కోట్లు విడుదల

అమరావతి, సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్ర దేశ్‌లో పింఛనుదారులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. అక్టోబర్ 1న ఉదయం 6.30 గంటల నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ పింఛన్ల పంపిణీ మిగతా2లో...

చిత్తూరులో కుంకీ ఏనుగులు

రంగంలోకి...

ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించాలి.. ప్రజలను అప్రమత్తం చేయాలి: పవన్ కల్యాణ్



అమరావతి,సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్ర చిత్తూరు జిల్లా పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల గుంపు సంచరిస్తున్న నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏనుగుల గుంపును తిరిగి అడవిలోకి మళ్లించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మానవఏనుగు ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఏనుగుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన చోట కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. హనుమాన్ మిగతా2లో...



బంగాళాఖాతంలో మరో వాయుగుండం

రాబోయే 72 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో వర్షాలు

అమరావతి,సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్ర ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణశాఖ మరో హెచ్చరిక చేసింది. బంగాళాఖాతంలో మయన్మార్‌అండమాన్ పరిసర ప్రాంతాల్లో మరో అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని తెలిపింది. ఇది రానున్న 12 గంటల్లో మరింత బలపడి మిగతా2లో...

అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై

చైనా సుంకాల తగ్గింపు

- సోయాబీన్స్‌కు మాత్రం అదనంగా 10 శాతం సుంకం కొనసాగింపు




బీజింగ్, 28(నేటి మినిట్ టు మినిట్): అమెరికాచైనా వాణిజ్య చర్చల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే పలు వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు చైనా అంగీకరించింది. అయితే

మిగతా2లో...

ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డికి ఊరట

- రూ.50 లక్షల అటాచ్‌మెంట్ ధ్రువీకరణ ఉత్తర్వులు రద్దు చేసిన అప్పిలేట్ ట్రైబ్యునల్





స్వర్ణ వార్డు ఉద్యోగులకు

పదోన్నతుల బాట

- నాలుగు విభాగాల ఉద్యోగులకు పదోన్నతులు.. 3,260 మందికి ప్రయోజనం

అమరావతి,సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శు భవార్త అందించింది. నాలుగు కేటగిరీలకు చెందిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు మిగతా2లో...



మంగళగిరిలో వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

- లోకేశ్ సమక్షంలో పలువురు నేతలు, కుటుంబాలు టీడీపీలోకి...

అమరావతి, సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): గుంటూరు జిల్లా మంగళగిరిలో పలువురు వైసీపీ నేతలు, వారి కుటుంబ సభ్యులు టీడీపీలో మిగతా2లో...

పోలీస్ వ్యవస్థకు కానిస్టేబుళ్లే

వెన్నుముక

- ప్రజలకు భరోసా కల్పించేలా విధులు నిర్వహించాలి: హోంమంత్రి అనిత



విజయనగరం,సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): పోలీస్ వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నుముక అని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. పోలీసు ఉద్యోగం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, ప్రజల రక్షణ కోసం నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు.విజయనగరం పోలీస్ శిక్షణ కళాశాల మైదానంలో 202526 బ్యాచ్‌కు చెందిన మహిళా పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హోంమంత్రి అనిత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 473 మంది మహిళా స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ కానిస్టేబుళ్లను అభినందించారు.పోలీస్ యూ నిఫాం ప్రజలకు భరోసా మిగతా2లో...



తుఫాన్ పంట నష్టాల ఎన్యుమరేషన్

వేగంగా పూర్తి చేయాలి

- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి,సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటల నష్టాల ఎన్యుమరేషన్‌ను వేగంగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పంట నష్టాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు.తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన ఏ ఒక్క రైతు వివరాలు కూడా ఎన్యుమరేషన్‌లో నమోదు కాకుండా మిగిలిపోకూడదని మంత్రి స్పష్టం చేశారు. నష్టాల నమోదు ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వాన్ని తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. **14 జిల్లాల్లో ఉద్యానవన పంటలకు నష్టం** ప్రాథమికంగా అందిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 89 మండలాలు, 351 గ్రామాల్లో ఉద్యానవన పంటలు తుఫాన్ మిగతా2లో...

తొలిసారి కక్ష్యలోకి స్టార్‌షిప్

స్పేస్‌ఎక్స్‌కు కీలక మైలురాయి.. 26 స్టార్‌లింక్ ఉపగ్రహాల ప్రయోగం



టెక్సాస్,సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన స్టార్‌షిప్ రాకెట్ తొలిసారిగా భూకక్ష్యలోకి విజయవంతంగా చేరింది. అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న స్టార్‌బేస్ నుంచి చేపట్టిన 14వ ప్రయోగంలో ఈ కీలక

మిగతా2లో...

కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణకు

రూ.160 కోట్ల బిల్లుల విడుదల

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి, 28(నేటి మినిట్ టు మినిట్): కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులకు సంబంధించి రూ.160 కోట్ల బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను విడుదల చేసిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురై దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోకి మిగతా2లో...

ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డికి ఊరట

హైదరాబాద్,సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓటుకు నోటు కేసులో ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. ఈ ఉత్తర్వులతో రేవంత్‌రెడ్డితో పాటు మరో ముగ్గురికి ఈ అంశంలో ఉపశమనం లభించింది.న్యూఢిల్లీలోని స్మగ్లర్స్ అండ్ ఫారెన్ ఎక్స్చేంజ్ మ్యానిప్యులేటర్స్ పరిధిలోని అప్పిలేట్ ట్రైబ్యునల్ ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయమూర్తి మునీశ్వర్‌నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం రేవంత్‌రెడ్డి, వేమ్ కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్ ఉదయ్‌సింహ, బిషప్ హ్యారీ సెబాస్టియన్ దాఖలు చేసిన అప్పీళ్లను విచారించింది. 2015 నాటి ఓటుకు నోటు వ్యవహారంలో రూ.50 లక్షల నగదును ఏసీబీ ఇప్పటికే స్వాధీనం చేసుకుని ట్రయల్ కోర్టులో భద్రపరిచిందని అప్పీలుదారుల తరఫు న్యాయవాదులు వాదించారు. దీంతో అదే మొత్తానికి సమానమైన మరో రూ.50 లక్షలను ఈడీ అటాచ్ చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.ఈ వాదనను పరిశీలించిన ట్రైబ్యునల్.. అసలు రూ.50 లక్షలు ఇప్పటికే కోర్టు ఆధీనంలో భద్రంగా ఉన్నందున వాటిని నిందితులు తరలించడం లేదా ఇతర విధంగా వినియోగించే అవకాశం లేదని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో సమాన విలువ కలిగిన మరో మొత్తాన్ని అటాచ్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో 2022లో అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది.అయితే ఈ తాజా ఉత్తర్వులు మొత్తం ఓటుకు నోటు క్రిమినల్ కేసును కొట్టివేసినట్లు కాదని సంబంధిత నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రధానంగా ఈడీ చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌కు సంబంధించిన అంశంపైనే ట్రైబ్యునల్ నిర్ణయం వెలువరించింది.

స్వర్ణ వార్డు ఉద్యోగులకు పదోన్నతుల బాట

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ జీవో నంబర్ 244ను జారీ చేసింది. ఈ నిర్ణయంతో మొత్తం 3,260 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది.పదోన్నతులు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డు శానిటేషన్, పర్యావరణ సెక్రటరీలు (గ్రేడ్2), వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలకు వర్తించనున్నాయి. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్ లేదా జూనియర్ అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్ లేదా సీనియర్ అకౌంటెంట్, సూపరింటెండెంట్ వంటి తదుపరి పోస్టులకు వెళ్లే అవకాశం కల్పించారు.

వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీతో పాటు జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్, సీనియర్ అకౌంటెంట్ పోస్టులకు పదోన్నతి అవకాశాలు కల్పించారు. శానిటేషన్, పర్యావరణ సెక్రటరీల గ్రేడ్2 పోస్టులను గ్రేడ్1గా అప్‌గ్రేడ్ చేసి తదుపరి పదోన్నతికి అవకాశం కల్పించా రు. స్వర్ణ వార్డుల్లో పనిచేస్తున్న మిగిలిన రెండు కేటగి రీల ఉద్యోగుల పదోన్నతులపై కూడా త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. అధికారుల కమిటీ సిఫారసులు అందిన అనంతరం ఆయా కేటగిరీలకు సంబంధించిన పదోన్నతులపై ఉత్తర్వు లు జారీ చేస్తామని వెల్లడించారు. దీర్ఘకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది. 2019లో నియమితులైన పలువురు ఉద్యోగులు ఒకే హోదాలో కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పదోన్నతి మార్గాలను ఖరారు చేసింది.

తుఫాన్ పంట నష్టాల ఎన్యుమరేషన్ వేగంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావానికి గురయ్యాయి. మొత్తం 1,734 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించారు. దీంతో 5,777 మంది రైతులు ప్రభావితమైనట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.ఉద్యానవన పంటల్లో జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నమోదు చేయాలని మంత్రి సూచించారు. రైతుల వారీగా నష్టాన్ని అంచనా వేయడంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. **44 వేల హెక్టార్లకు పైగా వ్యవసాయ పంటలకు నష్టం** వ్యవసాయ పంటల విషయానికి వస్తే 190 మండలాల్లోని 1,229 గ్రామాల్లో తుఫాన్ ప్రభావం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. సుమారు 44,029 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది.ఈ నష్టంతో 71,796 మంది రైతులు ప్రభావితమైనట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. అయితే క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తయ్యే కొద్దీ నష్టం వివరాల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది.**జిల్లాల వారీగా సమగ్ర నివేదికలు** ప్రతి జిల్లాలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. జిల్లాల వారీగా, పంటల వారీగా సమగ్ర నష్టం వివరాలను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి అందించాలని సూచించారు.ఎన్యుమరేషన్ ప్రక్రియలో రైతులకు సంబంధించిన వివరాలు, దెబ్బతిన్న పంట విస్తీర్ణం, నష్టం తీవ్రత తదితర అంశాలను పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. తుఫాన్ ప్రభావిత రైతులకు నష్టం అంచనాల ఆధారంగా ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు అధికారుల నివేదికలు కీలకమని మంత్రి పేర్కొన్నారు.వంట నష్టాల నమోదు ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వంతో పాటు వేగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.

కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణకు రూ.160 కోట్ల బిల్లుల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన తర్వాత తిరిగి గాడిలో పెడుతోందని మంత్రి తెలిపారు. కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణకు అవసరమైన నిధులను అందుబాటులో ఉంచుతూ సాగునీటి వ్యవస్థను నిరంతరం సమర్థ వంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని పేర్కొన్నారు.**రైతుల భాగస్వామ్యంతో సాగునీటి నిర్వహణ** గత ప్రభుత్వం రద్దు చేసిన సాగునీటి సంఘాల వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ధరించారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రైతులను సాగునీటి నిర్వహణలో భాగస్వాములను చేయడం ద్వారా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఏర్పడిందన్నారు.ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న పరిమిత జల వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో సాగునీటి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. రైతుల భాగస్వామ్యంతో సాగునీటి నిర్వహణ చేపట్టాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.**రెండేళ్లలో రూ.1,320 కోట్లు మంజూరు** గత ఐదేళ్ల పాలనలో ఓఅండ్ఎం పనులకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించారని మంత్రి తెలిపారు. దీంతో కాలువలు, డ్రెయిన్లు, ఇతర సాగునీటి మౌలిక వసతుల నిర్వహణ తీవ్రంగా దెబ్బతిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఓఅండ్ఎం పనుల కోసం రూ.1,320 కోట్లు మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. తాజాగా రూ.160 కోట్ల బిల్లులను విడుదల చేయడం ద్వారా నిర్వహణ పనులకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యత కాలువల్లో పూడికతీత, లాకులు, షట్టర్లు, రోప్‌ల మరమ్మతులు వంటి అత్యవసర పనులకు గతంలో తగినంత నిధులు అందలేదని మంత్రి పేర్కొన్నారు. సాగునీటి వ్యవస్థలో అవసరమైన చిన్నపాటి నిర్వహణ పనులకు సైతం నిధులు అందని పరిస్థితి ఉండేదన్నారు.ప్రస్తుతం కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణకు అవసరమైన నిధులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సాగునీటి వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా నిరంతర పర్యవేక్షణ, నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు .రైతుల ప్రయోజనాలు, సాగునీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

తొలిసారి కక్ష్యలోకి స్టార్‌షిప్

(మొదటి పేజీ తరువాయి)

విజయాన్ని సాధించింది.ప్రయోగంలో భాగంగా 26 స్టార్‌లింక్ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ప్రయోగం అనంతరం సూపర్ హెవీ బూస్టర్ గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో నియంత్రితంగా దిగింది. మరోవైపు స్టార్‌షిప్ పైదశ తన కక్ష్య ప్రయాణాన్ని కొనసాగించింది.చంద్రుడు, అంగారక గ్రహం వంటి సుదూర లక్ష్యాలకు మానవులను, భారీ సరుకులను తరలించే పునర్వినియోగ అంతరిక్ష నౌకగా స్టార్‌షిప్‌ను స్పేస్‌ఎక్స్ అభివృద్ధి చేస్తోంది. ఈ విజయం సంస్థ భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన

- కూటమి ప్రభుత్వంపై బొత్స సత్యనారాయణ విమర్శలు



విజయనగరం,సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తోందని వైసీపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.గ్రామ రాజకీయాల్లోనూ పోలీసుల జోక్యం పెరిగిందని బొత్స విమర్శించారు. ఇటీవల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, పంట నష్టానికి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

అక్టోబర్ 1న ఉదయం 6.30 నుంచే పింఛన్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ విషయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా 61.80 లక్షల మంది పింఛనుదారులకు రూ.2,692.34 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో రూ.2,692.28 కోట్లను పంచాయతీ, వార్డు ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛను మొత్తాన్ని అందించనున్నారు.ఇటీవల బ్యాంకు ఉద్యోగుల సమ్మె కారణంగా పింఛన్ల పంపిణీపై సందేహాలు నెలకొన్నప్పటికీ, సమ్మె విరమించడంతో పంపిణీ యథావిధిగా కొనసాగనుంది. సెప్టెంబర్ 30న గ్రామ, వార్డు సిబ్బంది బ్యాంకుల నుంచి నగదును ఉపసంహరించుకునేలా చర్యలు చేపట్టారు. దీంతో అక్టోబర్ 1 ఉదయం నుంచే లబ్ధిదారులకు నగదు అందించనున్నారు.పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పీడీలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు పింఛన్లు సకాలంలో అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై చైనా సుంకాల తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా నుంచి అత్యధికంగా దిగుమతి చేసుకునే సోయాబీన్స్‌ను ఈ మినహాయింపుల జాబితా నుంచి తప్పించింది. దీంతో అమెరికా సోయాబీన్స్‌పై అదనంగా 10 శాతం సుంకం కొనసాగనుంది.చైనా విడుదల చేసిన జాబితాలో మొక్కజొన్న, గోధుమలు, జొన్నలు, మాంసం, పాల ఉత్పత్తులు, కూరగాయల నూనెలు, సోయా నూనె, సోయా మీల్‌తో పాటు పలు వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయి. 2024లో ఈ జాబితాలోని వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తుల వాణిజ్యం సుమారు 17 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు రాయిటర్స్ నివేదిక పేర్కొంది.**సోయాబీన్స్‌పై కొనసాగనున్న భారం** అమెరికా సోయాబీన్స్‌పై అదనంగా 10 శాతం సుంకం కొనసాగనుంది. ఈ సుంకం ప్రైవేటు సోయాబీన్ ప్రాసెసింగ్ సంస్థలకు భారంగా మారే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు చైనా ప్రభుత్వ రంగ సంస్థలు అమెరికా నుంచి సోయాబీన్స్ కొనుగోళ్లను కొనసాగిస్తున్నాయి. సినోగ్రెయిన్, కోఫ్కో సంస్థలు ఇప్పటికే 1.2 కోట్ల టన్నులకు పైగా అమెరికా సోయాబీన్స్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం.**30ఫర్30 జాబితాలు** అమెరికా, చైనాలు పరస్పరం సుంకాల తగ్గింపునకు సంబంధించిన '30ఫర్30' ఉత్పత్తుల జాబితాలను విడుదల చేశాయి. దాదాపు 30 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా సున్నితత్వం లేని ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు చైనా చర్యలు చేపట్టగా, అమెరికా కూడా చైనా నుంచి దిగుమతి చేసుకునే 77 రకాల వస్తువులకు సుంకాల సడలింపులను ప్రకటించింది. ఇరుదేశాలు వాణిజ్య సంబంధాల కోసం ప్రత్యేక వాణిజ్య మండలిని ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయి.అమెరికాచైనా మధ్య ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశం అనంతరం ఈ నిర్ణయాలు వెలువడ్డాయి. అయితే సోయాబీన్స్‌పై అదనపు సుంకం కొనసాగడం ఇరుదేశాల వ్యవసాయ వాణిజ్యంలో కీలక అంశంగా మారింది.

చిత్తూరులో కుంకీ ఏనుగులు రంగంలోకి...

(మొదటి పేజీ తరువాయి)

బృందాలతో పాటు పోలీసు, రెవెన్యూ శాఖల సహకారంతో ఏనుగుల సంచారాన్ని పర్యవేక్షించాలని సూచించారు. ఏనుగుల కదలికలను బట్టి పరిసర గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు.ఏనుగుల సంచారం కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఏనుగులను అడవిలోకి సురక్షితంగా మళ్లించేలా చర్యలు చేపట్టాలని పవన్ సూచించారు.

బంగాళాఖాతంలో మరో వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది.ఈ వాయుగుండం ప్రభావంతో రాబోయే 72 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇటీవల ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో గణనీయమైన వర్షపాతం నమోదైంది. తాజా వాయుగుండం ప్రభావంతో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం పరిస్థితిని పర్యవేక్షిస్తోంది.

మంగళగిరిలో వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

(మొదటి పేజీ తరువాయి)

చేరారు. మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ సమక్షంలో వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మంగళగిరి పట్టణ వైసీపీ మాజీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. అలాగే ఉండవల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కళ్లం సంజీవ్‌రెడ్డి, తాడేపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నేత జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నిడమర్రుకు చెందిన వైసీపీ నేత కట్టెపోగు బాబురావు, గుంటూరు బ్రాహ్మణ సంఘం కార్యదర్శి వేమవరపు నారాయణ తదితరులు టీడీపీ కండువాలు కప్పుకున్నారు.లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రుల నుంచి స్మశానవాటికల వరకు అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రాబోయే రెండేళ్లలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీరు, వంటగ్యాస్ సంబంధిత పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.మంగళగిరి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని లోకేశ్ తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.టీడీపీ నాయకులు గుత్తికొండ ధనుంజయ్, నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, ఆకుల జయసత్య, ముమ్మిడి సత్యనారాయణ, పడవల మహేష్, పల్లబోతుల శ్రీనివాసరావు, వల్లభనేని వెంకట్రావు, దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నుముక

(మొదటి పేజీ తరువాయి)

కల్పించేలా ఉండాలని, ధైర్యంగా విధులు నిర్వర్తించాలని హోంమంత్రి సూచించారు. మహిళా పోలీసులు కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. శిక్షణ కాలం వారి జీవితానికి పునాది వంటిదని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, రాష్ట్రానికి పెట్టుబడులు రావడానికి ఇది కూడా ఒక కారణమని హోంమంత్రి తెలిపారు. మహిళా కానిస్టేబుళ్లు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు ఈ సందర్భంగా అవార్డులు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్‌రెడ్డి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, పీటీసీ ప్రిన్సిపాల్ రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

జెండా మోస్తే కార్యకర్త..
డబ్బు చూపిస్తే నాయకుడా?

● ఓటు అందరిదీ.. టికెట్లు మాత్రం డబ్బున్నోళ్లకేనా? ● జెండా నీదే.. కుర్చీ మాత్రం పైసలున్నోడిదే ● కార్యకర్తకు జెండా.. నాయకుడికి కుర్చీ.. కాసులు ఎవరివి? ● మేయర్ కుర్చీకి రేటెంత..? కార్పొరేటర్ టికెట్‌కు కాసులెంత? ● ప్రజాసేవకు రీల్స్ చాలు.. టికెట్‌కు డబ్బులు కావాలా? ● జెండాలు మోసినోళ్లకు 'కార్యకర్త' బిరుదు.. కాసులు పెట్టినోళ్లకు 'నాయకుడు' హోదా ● ఓటు వేయడానికి అందరూ కావాలి.. టికెట్ ఇవ్వడానికి మాత్రం కొందరేనా? ● రీల్స్‌లో ప్రజాసేవ.. రియల్‌లో పదవుల వేట ● పార్టీ కోసం కష్టపడితే కార్యకర్త.. పార్టీకి కాసులు పెడితే అభ్యర్థి ● కార్యకర్తల చెమటకు విలువ లేదా.. కాసులకే టికెట్ తలుపులు తెరుస్తారా? ● జెండా మోసిన చేతులకు టికెట్ లేదా.. నోట్ల కట్టలకే స్వాగతమా? ● మేయర్ కుర్చీనా.. లేక 'కోట్ల కుర్చీనా'? ● కార్పొరేటర్ టికెట్‌కు అర్హత ఏంటి? సేవా? లేక సొమ్మా? ● పార్టీ జెండా మోస్తే ఐదేళ్లు.. కాసులు చూపిస్తే పదవి ● కార్యకర్త కష్టం పార్టీకి.. పదవి మాత్రం పైసలున్నోడికి ● రాజకీయాల్లో కొత్త ఫార్ములా: జెండా మోయి.. కాసులు లెక్కపెట్టు ● కార్యకర్తల కన్నీళ్లు.. నాయకుల కాసుల లెక్కలు ● టికెట్ కోసం సేవా చరిత్రా? లేక బ్యాంక్ బ్యాలెన్సా? ● జెండా మోసినోడు వెయిటింగ్‌లో.. డబ్బు తెచ్చినోడు కుర్చీలో ● కూటమి పార్టీలపై జై భీమ్ పార్టీ నేత నరేష్ తీవ్ర వ్యాఖ్యలు ● "అనంతపురం మేయర్ కావాలంటే కోట్లు చూపించాలా?"



అనంతపురం: సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): రాజకీయ పార్టీల్లో ఏళ్ల తరబడి జెండాలు మోసి, పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు పదవులు, టికెట్లు దక్కకుండా డబ్బున్న వారికి మాత్రమే అవకాశాలు కల్పిస్తున్నారంటూ జై భీమ్ పార్టీ నేత నరేష్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి పార్టీలతో పాటు ఇతర రాజకీయ పార్టీలపైనా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. **జెండా మోసినవాడు కార్యకర్తగానే.. డబ్బున్న వాడు నాయకుడిగానా?** పార్టీల కోసం ఏళ్ల తరబడి పనిచేసే కార్యకర్తలు చివరకు కార్యకర్తలుగానే మిగిలిపోతున్నారని నరేష్ అన్నారు. డబ్బులు ఖర్చు చేయగలిగిన వారికే టికెట్లు, పదవులు దక్కుతున్నాయనే ఆరోపణలు చేశారు."జెండాలు మోసేవాళ్లు జెండాలు మోస్తూనే ఉన్నారు. కష్టపడిన కార్యకర్తలు కూలీలుగానే మిగులుతున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసే వారు మాత్రం నాయకులుగా ఎదుగుతున్నారు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. **"మేయర్ కావాలంటే కోట్లు చూపించాలా?"** అనంతపురం నగర రాజకీయాలపై కూడా నరేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మేయర్ పదవి కోసం కోట్ల రూపాయలు చూపించాల్సిన పరిస్థితి ఉందంటూ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారంపై ఆయన ప్రశ్నలు సంధించారు. కార్పొరేటర్ టికెట్ల విషయంలోనూ డబ్బుకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కన పెట్టి, ఎన్నికల సమయంలో మాత్రమే తెరపైకి వచ్చే వారికి ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. **సోషల్ మీడియా రీల్స్.. రాజకీయ పదవుల రేస్** ఎన్నికల సమయంలో కొందరు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని నరేష్ విమర్శించారు.సహాయ కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలు, రీల్స్ ద్వారా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం మాత్రమే ప్రజాసేవ కాదని వ్యాఖ్యానించారు. "రీల్స్‌లో కనిపించడం వేరు.. రియల్‌గా ప్రజల మధ్య పనిచేయడం వేరు. రీల్స్‌తో రాజకీయాలు నడిపిస్తే రేపు కార్పొరేషన్ పరిస్థితి కూడా రీల్స్‌లాగే మారే ప్రమాదం ఉంది" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. **బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సమాన అవకాశాలేవీ?** రాజకీయ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని నరేష్ డిమాండ్ చేశారు.అగ్రవర్ణాలకు చెందినవారే పార్టీల్లో కీలక పదవులు, నిర్ణయాధికారాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన కార్యకర్తలు ఏళ్ల తరబడి పార్టీల కోసం పనిచేసినా వారికి తగిన రాజకీయ అవకాశాలు రావడం లేదని అన్నారు. **"ఓటు బ్యాంకుగా మాత్రమే చూడొద్దు"** ఎన్నికల సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఓట్లను కోరుతూ.. వారికి రాజకీయ అవకాశాలు కల్పించే విషయంలో మాత్రం వెనుకడుగు వేయడం సరికాదని నరేష్ అన్నారు. పార్టీల కోసం పనిచేసే కార్యకర్తలకు గౌరవం, రాజకీయ భవిష్యత్తు కల్పించాల్సిన బాధ్యత పార్టీ నాయకత్వాలపై ఉందని పేర్కొన్నారు.**పదవులు డబ్బుతోనా.. ప్రజా సేవతోనా?** ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే వారికి ప్రజలతో సంబంధం, పార్టీ కోసం చేసిన పని, ప్రజాసేవ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నరేష్ కోరారు. కేవలం ఆర్థిక సామర్థ్యం ఆధారంగా రాజకీయ అవకాశాలు కల్పిస్తే సాధారణ కార్యకర్తలకు రాజకీయాల్లో ఎదిగే అవకాశం తగ్గిపోతుందని అన్నారు.**అన్ని వర్గాలకు సమాన రాజకీయ అవకాశాలు కల్పించాలి** రాజకీయాల్లో అన్ని సామాజిక వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని జై భీమ్ పార్టీ నేత నరేష్ డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పార్టీల కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు.డబ్బు ప్రభావం, సామాజిక అధిపత్యం కాకుండా ప్రజాసేవ, పార్టీ కోసం చేసిన కృషి, ప్రజలతో ఉన్న సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

'ఆర్టీసీ బస్సు ప్రయాణం.... బూతు పురాణం '

● బస్సెక్కుతున్న మహిళపై బూతుల దాడి? ● "...గు... మూసుకొని బస్సు ఎక్కు" అంటూ దూషించాడని బాధితురాలి ఆరోపణ ● 'ఉచిత ప్రయాణం'కు కొత్త ట్రీట్‌మెంట్ ● డ్రైవర్ దుర్భాషల ఆరోపణతో కలెక్టరేట్ ఎదుట బాధితురాలి నిరసన ● ఆర్టీసీ బస్సులో 'ఉచిత ప్రయాణం'.. ఉచితంగానే తిట్లా? ● బత్తలపల్లిలో మహిళ ఆరోపణలతో కలకలం ● బస్సు నిండితే సీట్లు పెంచండి.. కోపం పెంచొద్దు, ప్రజలు ● రద్దీపై ప్రయాణికుల అసంతృప్తి.. డ్రైవర్ వ్యవహారంపై మహిళ ఫిర్యాదు ● మహిళను దూషించారన్న ఆరోపణలపై ఆర్టీసీ విచారణకు డిమాండ్ ● బస్సెక్కినందుకు 'స్వాగతం' ఇదేనా? ● డ్రైవర్ దుర్భాషల ఆరోపణతో మహిళ కన్నీటి నిరసన ● బత్తలపల్లి ఘటనపై ప్రయాణికుల ఆగ్రహం ● మహిళల పట్ల సిబ్బంది వ్యవహారశైలిపై ప్రశ్నలు





మహిళను బూతులు తిట్టిన ఆర్టీసీ డ్రైవర్, ఏమీ జరిగిందో వివరణ ఇస్తున్న దృశ్యం

బత్తలపల్లి, సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): బస్సు ఎక్కే సమయంలో ఆర్టీసీ డ్రైవర్ తనను అసభ్య పదజాలంతో దూషించాడని ఓ మహిళ ఆరోపించింది. డ్రైవర్ తన పట్ల అనుచితంగా మాట్లాడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె, అనంతపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. **అసభ్య పదజాలంతో దూషించాడని ఆరోపణ** బస్సు ఎక్కుతున్న సమయంలో డ్రైవర్ తనను ఉద్దేశించి అసభ్య పదజాలంతో మాట్లాడాడని బాధితురాలు వాపోయింది. "...గు... మూసుకొని బస్సు ఎక్కు" అంటూ దుర్భాషలాడినట్లు ఆమె ఆరోపించింది. ప్రయాణికుల సమక్షంలో తనను అవమానించేలా మాట్లాడటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని కన్నీటి పర్యంతమైంది. **బంధువులు ప్రశ్నించడంతో ఉద్రిక్తత** ఘటన అనంతరం బాధితురాలి బంధువులు డ్రైవర్‌ను ప్రశ్నించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. మహిళ పట్ల బహిరంగంగా అసభ్య పదజాలం ఉపయోగించడం సరికాదని ఆమె బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. **ఉచిత ప్రయాణం.. పెరుగుతున్న రద్దీ** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే ప్రభుత్వ పథకం అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరుగుతోందనే చర్చ జరుగుతోంది. పలు ప్రాంతాల్లో రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యం మహిళలకు ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ప్రజా రవాణా సౌకర్యాలను కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మీడియా ముందు వివరాలు వెల్లడిస్తున్న మహిళా

రద్దీ ఉంటే దుర్భాషలాడాల్సిందేనా? బస్సులో సీట్లు లేకపోవడం, రద్దీ ఎక్కువగా ఉండటం వంటి పరిస్థితులు ఎదురైతే ప్రయాణికులకు ఓపికగా పరిస్థితిని వివరిం చాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంటుందని ప్రయాణికులు చెబుతు న్నారు. రద్దీ కారణంగా సిబ్బందిపై ఒత్తిడి ఉన్నప్పటికీ ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. బత్తలపల్లిలో జరిగిన ఘటనలో అసలు ఏం జరిగింది? డ్రైవర్ నిజంగానే అసభ్య పదజాలం ఉపయోగించారా? లేక ఘటనకు మరేదైనా నేపథ్యం ఉందా? అనే విషయాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించాలి మహిళను అవమానించేలా డ్రైవర్ మాట్లాడారనే ఆరో పణలపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించాలని బాధితురాలి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యత వహించాల్సిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఘటనకు సంబం ధించి బాధితురాలి ఆరోపణలు, డ్రైవర్ లేదా ఆర్టీసీ అధికారుల వివరణ అధికారికంగా వెలువడాల్సి ఉం ది. ఇరుపక్షాల వాదనలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరి శీలించిన అనంతరం పూర్తి వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

రాజీనామా రాష్ట్రం దాటింది.... “ ఘటన మాత్రం గప్‌చుప్ ఉండాలే “

● ఒక్క రాజీనామా.. వంద ప్రశ్నలు ● రాజీనామా దాటింది రాష్ట్రం.. చిక్కుముడి వీడేదెప్పుడు? ● జర్నలిస్టుల రాజీనామా.. ప్రశ్నల ‘బ్యాంక్ బ్యాలెన్స్’ బయటకు వస్తుందా? ● మైక్ పట్టినోళ్లపై ఆరోపణలు.. ఇప్పుడు మైక్ ముందు సమాధానాలెప్పుడు? ● జెండా కాదు.. రాజీనామా పట్టుకున్న జర్నలిస్టు ● నోటీసులతో నోరు మూయిస్తారా.. ప్రశ్నలకు తాళం వేయగలరా? ● కాల్ లిస్ట్ తెరిస్తే కథ మారుతుందా? ● బ్యాంకు స్టేట్‌మెంట్ తెరిస్తే ‘బ్రేకింగ్ న్యూస్’ బయటపడుతుందా? ● స్టింగ్ వీడియో ఎక్కడ..? స్క్రీన్ వెనుక కథేంటి? ● మైకులు మోగుతున్నాయ్.. సమాధానాలు మాత్రం మౌనమే ● మీడియాపై మబ్బులు.. రాజీనామాతో మెరుపులు ● ఒక్క సంతకం.. మీడియా వర్గాల్లో ప్రకంపనలు ● రాజీనామా రహస్యం.. ట్రెల్లిస్ కేసులో కొత్త ట్విస్ట్ ● ‘డబ్బులు తీసుకోలేదు’ అని ప్రమాణం చేస్తారా? ● నోటీసుల రాజకీయం.. నిజాల కోసం తల్లి పోరాటం ● రీల్స్‌లో కాదు.. బ్యాంక్ స్టేట్‌మెంట్లలో నిజాలా? ● ఆరోపణల తుఫాను.. మీడియా మౌనం ● రాజీనామా ఒకటే.. అనుమానాలు వంద ● మూడు వారాల కేసు.. మూడో కన్ను ఎప్పుడు తెరుస్తారు? ● మైక్ ముందు ప్రశ్నలు.. బ్యాంక్‌లో సమాధానాలా? ● చిన్నారి కేసు.. పెద్దల గుండెల్లో గుబులు? ● స్టింగ్ వీడియో బయటకొస్తే.. తెర వెనుక ముఖాలెన్ని? ● రాజీనామా చాలు.. ఇప్పుడు విచారణ మాటేమిటి? ● మీడియా ‘బ్రేకింగ్’ కంటే.. నిజాల బ్రేకింగ్ ఎప్పుడు? ● కాల్ లిస్ట్, సీసీ కెమెరా, బ్యాంక్ ఖాతాలు.. నిజానికి మూడు తాళాలు



అనంతపురం, సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ట్రెల్లిస్ స్కూల్‌కు సంబంధించిన చిన్నారి ఘటనలో కొత్త పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. జర్నలిస్టుల ఓ ఆర్గనైజేషన్‌కు డాక్టర్ ఆర్కే సూర్య రాజీనామా చేయడం అనంతపురం మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ రాజీనామాకు సంబంధించి వివిధ రకాల చర్చలు, ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో వినిపిస్తున్న నేపథ్యంలో అసలు కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. **రాజీనామాతో మొదలైన ప్రశ్నల పరంపర** డాక్టర్ ఆర్కే సూర్య రాజీనామా చేసిన నేపథ్యంలో ట్రెల్లిస్ స్కూల్ ఘటనకు సంబంధించిన అంశాలు మరోసారి తెరపైకి వచ్చాయి. చిన్నారి తల్లి మాత్రం ఘటనకు సంబంధించి వాస్తవాలు వెలుగులోకి రావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.జర్నలిస్టులు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, అవి నిజమా కాదా తెలుసుకోవాలంటే సంబంధిత సమయంలోని కాల్ వివరాలు, బ్యాంకు లావాదేవీలు, సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించాలని ఆమె కోరుతున్నారు. **“బ్యాంకు లావాదేవీలు పరిశీలిస్తే నిజాలు తెలుస్తాయి”**ఘటన జరిగిన తేదీ నుంచి సంబంధిత వ్యక్తుల బ్యాంకు లావాదేవీలను పరిశీలించాలని చిన్నారి తల్లి డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా స్కూల్‌కు సంబంధించిన బ్యాంకు లావాదేవీలు, సంబంధిత వ్యక్తుల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు జరిగితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఆమె పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక దర్యాప్తులో ఆధారాలు వెలుగులోకి రావాల్సి ఉంది. **స్టింగ్ ఆపరేషన్ వీడియో ఎక్కడ?** ట్రెల్లిస్ స్కూల్ ఘటనకు సంబంధించి ఓ స్టింగ్ ఆపరేషన్ వీడియోలో కీలక విషయాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోందని చిన్నారి తల్లి చెబుతున్నారు. ఆ వీడియో పూర్తిగా వెలుగులోకి వస్తే ఘటనకు సంబంధించి పలువురి పాత్రపై స్పష్టత వస్తుందని ఆమె అభిప్రాయపడుతున్నారు. ఆ వీడియో నిజంగా ఉందా? దానిలో ఏముంది? దాని ప్రామాణికత ఎంత? అనే అంశాలు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. **“నోటీసులతో మా నోరు మూయించలేరు”** తమ న్యాయపోరాటాన్ని అడ్డుకునేందుకు నోటీసులు, ఇతర ఒత్తిళ్లు ఉపయోగిస్తున్నారనే ఆవేదనను చిన్నారి తల్లి వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. “మేము ఎవరి దగ్గరా అన్యాయం కోరడం లేదు. నిజాలు బయటకు రావాలి. తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు ఎదుర్కోవాలి” అని ఆమె కోరుతున్నారు. **‘డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేయండి’** తన ఆరోపణలను ఖండిస్తున్న వారు తమ పిల్లలపై ప్రమాణం చేసి తాము ఎలాంటి డబ్బులు తీసుకోలేదని చెప్పాలని చిన్నారి తల్లి భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. అయితే వ్యక్తిగత ఆరోపణలు, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న కథనాల ఆధారంగా ఎవరినీ దోషులుగా నిర్ధారించలేమని, అధికారిక దర్యాప్తు ద్వారానే వాస్తవాలు తేలాల్సి ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. **మీడియా యాజమాన్యాలపై ప్రశ్నలు** ఘటనపై సమగ్రంగా విచారణ జరగాలని కోరుతున్న నేపథ్యంలో కొన్ని మీడియా సంస్థల పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక ఘటనపై వివిధ కథనాలు ప్రచారంలోకి వచ్చినప్పుడు వాటి వెనుక ఉన్న ఆధారాలను పరిశీలించి, వాస్తవాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు జర్నలిస్టులపై ఆరోపణలు వస్తుండగా, మరోవైపు సంబంధిత మీడియా సంస్థలు వాటిపై అధికారికంగా స్పందించాల్సిన అవసరం ఉందనే చర్చ సాగుతోంది. **మూడు వారాలైనా.. న్యాయం ఎక్కడ?** చిన్నారి ఘటన జరిగి సుమారు మూడు వారాలు గడుస్తున్నా పూర్తిస్థాయి విచారణ, తదుపరి చర్యలపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచారణను వేగవంతం చేసి, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో బాలల హక్కుల కమిషన్ ఘటనను సుమోటోగా స్వీకరించిందనే అంశం కూడా చర్చకు వచ్చింది. కమిషన్ విచారణలో ఏ అంశాలు వెలుగులోకి వస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. **ఒక్క రాజీనామా.. ఎన్నో అనుమానాలు** డాక్టర్ ఆర్కే సూర్య రాజీనామాతో ఇప్పటికే చర్చలో ఉన్న ట్రెల్లిస్ స్కూల్ ఘటన మరోసారి రాష్ట్రవ్యాప్తంగా చర్చకు వచ్చింది. అయితే ఆ రాజీనామాకు అసలు కారణం ఏమిటి? ఘటనకు సంబంధించిన ఆరోపణలకు దానికి ఏమైనా సంబంధం ఉందా? లేక వేరే కారణాలున్నాయా? అనేది స్పష్టత రావాల్సి ఉంది. రాజీనామాను ఆధారంగా చేసుకుని ఎవరిపైనా ఆరోపణలను నిర్ధారించడం సాధ్యం కాదు. సంబంధిత వ్యక్తుల వివరణలు, పత్రాలు, ఆర్థిక లావాదేవీలు, కాల్ వివరాలు, సీసీ ఫుటేజీలు తదితర ఆధారాలను పరిశీలించిన తర్వాతే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉంది.

‘పెద్ద తిమింగలాలు’ ఉన్నాయా? ట్రెల్లిస్ ఘటనలో ఇంకా కీలక వ్యక్తులు బయటకు రావాల్సి ఉందని చిన్నారి తల్లి ఆరోపిస్తున్నారు. ఎవరు ఎవరితో మాట్లాడారు? ఎవరి మధ్య ఎలాంటి లావాదేవీలు జరిగాయి? ఘటన అనంతరం ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? వంటి అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆమె కోరుతున్నారు. **ఫోన్ కాల్స్‌పైనా చర్చ** ఘటన తర్వాత జర్నలిస్టుల మధ్య జరిగినట్లు చెబుతున్న కొన్ని ఫోన్ సంభాషణలు, ఆడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. వాటి ప్రామాణికత, పూర్తి నేపథ్యం నిర్ధారించకుండా వాటిని ఆధారాలుగా పరిగణించడం సరికాదని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. ఆడియోలు నిజమైనవే అయితే వాటి పూర్తి సందర్భం, తేదీ, సమయం, మాట్లాడిన వ్యక్తుల గుర్తింపును అధికారిక దర్యాప్తులో నిర్ధారించాల్సి ఉంటుంది.

ఈ వారంలో ఏం జరగబోతోంది? డాక్టర్ ఆర్కే సూర్య రాజీనామా, చిన్నారి తల్లి చేస్తున్న ఆరోపణలు, బాలల హక్కుల కమిషన్ చర్యలు, వైరల్ అవుతున్న ఆడియోలు, స్టింగ్ ఆపరేషన్ వీడియోపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో అనంతపురం మీడియా వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలకు అతీతంగా అధికారిక దర్యాప్తులో వెలుగులోకి వచ్చే ఆధారాలే కీలకం కానున్నాయి. చిన్నారికి న్యాయం జరగాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, మీడియా సంస్థలు, సంబంధిత అధికారులు తమ వాదనలను అధికారికంగా వెల్లడించిన తర్వాతే ఈ వ్యవహారంలో పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

భాష్యం విద్యాసంస్థల్లో మైక్రో గ్రీన్స్‌పై అవగాహన సదస్సు



అనంతపురం, సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న భాష్యం విద్యాసంస్థల్లో ఎరిస్ ఆగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మైక్రో గ్రీన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎరిస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ జోనల్ సేల్స్ మేనేజర్ శ్రీనివాస నాయుడు విద్యార్థులకు మైక్రో గ్రీన్స్ పెంపకంపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. కోకోపీట్‌ను ఎలా ఉపయోగించాలి, విత్తనాలను ఎలా నానబెట్టాలి, విత్తనాలు నాటే విధానం, నీరు అందించే పద్ధతి, మొలకలు వచ్చిన తర్వాత వాటి సంరక్షణ వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు.విద్యార్థుల చేత స్వయంగా విత్తనాలను నానబెట్టించడం, కోకోపీట్‌లో నాటించడం, నీరు అందించడం వంటి ప్రక్రియలను చేయించి, మైక్రో గ్రీన్స్ మొలకెత్తే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ ప్రక్రియను సుమారు ఏడు రోజుల పాటు పరిశీలించేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు.మైక్రో గ్రీన్స్, మొలకెత్తిన స్ప్రౌట్స్‌లో వివిధ పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని, వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుందని శ్రీనివాస నాయుడు వివరించారు. ముఖ్యంగా విటమిన్లు, ప్రోటీన్లు తదితర పోషకాలు లభించే విధానాన్ని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు విత్తనం నుంచి మొలక, అక్కడి నుంచి మైక్రో గ్రీన్స్‌గా ఎదిగే ప్రక్రియను స్వయంగా తెలుసుకునే అవకాశం పొందారు. భాష్యం విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నంద్యాలలో ‘ప్రపంచ రేబీస్ దినోత్సవం’ పోస్టర్ ఆవిష్కరణ



నంద్యాల, సెప్టెంబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నశేద్యాల జిల్లా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శారద బాయి, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ యస్. అక్రుఫ్ ఆలీ, జిల్లా “ప్రపంచ రేబీస్ దినోత్సవం – 2026“ పోస్టర్ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజషన్ అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మీ, డి పి యమ్ ఓ అధికారి డాక్టర్ శ్రీనివాసులు మరియు డాక్టర్ శ్రీజ ఇతర వైద్యులు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. “కలిసి ఉంటే మరింత బలం“ అనే నినాదంతో రేబీస్ వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రేబీస్ వ్యాధి నివారణ, కుక్కలు మరియు తదితర జంతువుల కాటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటం, కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు మరియు నీటితో శుభ్రంగా కడిగి, ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్యసంస్థను సంప్రదించి అవసరమైన యాంటీ రేబీస్ వ్యాక్సిన్ మరియు వైద్య చికిత్స పొందాలని అధికారులు సూచించారు.“రేబీస్‌ను నివారిం చవచ్చు అవగాహనతో ప్రాణాలను కాపాడవచ్చు” అనే సందేశంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులు పిలుపునిచ్చారు.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.